ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, మార్చి 28 : పట్టణంలోని కోటగల్లీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీనివాసుడి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీనివాసుడి కల్యాణోత్సవంలో పాల్గొనడం నా అదృష్టమని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో భక్తులతో కలిసి పోచారం భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

మాచారెడ్డి, మార్చి 28 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న జగదాంబ ఉత్సవాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు నిర్వాహకులు ఆహ్వాన పత్రికను గురువారం అందించారు. ఆలయ చరిత్ర, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంజీనాయక్, ఫకీరానాయక్, భాస్కర్, శ్రీరాం, రాజు, ప్రకాశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

బాన్సువాడ రూరల్, మార్చి 28 : రోజువారీ కూలి గిట్టుబాటు కావాలంటే కొలతల ప్రకారం పనులను చేయాలని ఎంపీడీవో బషీరుద్దీన్ ఉపాధి హామీ కూలీలకు సూచించారు. మండలంలోని మొగులాన్‌పల్లి తండా శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులు, మస్టర్లను గురువారం పరిశీలించారు. పనులకు వచ్చే వారికి మాత్రమే హాజరు వేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులను చేయాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, క్షేత్రసహాయకుడు బస్వయ్య తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా మలుపులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

బిచ్కుంద, మార్చి 28 : మండల కేంద్రం నుంచి పెద్దతక్కడపల్లి గ్రామానికి వెళ్లే దారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏడు కిలోమీటర్లమేర నాలుగు మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయాల పాలవుతున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, బీదర్ వెళ్లే వాహనదాలకు ఈ దారిగుండా ప్రయాణం చేస్తే ఆరు కిలోమీటర్ల దూరభారం తగ్గడంతో నిత్యం వందల సంఖ్యల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇకనైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

బిచ్కుంద – పెద్దతక్కడ్‌పల్లి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం

సంబంధిత గుత్తేదారుకు తెలిపి వారం రోజుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారులు మలుపుల వద్ద తక్కువ వేగంతో జాగ్రత్తగా వెళాలి.

- మధురాజ్, పంచాయతీరాజ్ ఏఈ

ప్రారంభమైన వరి కోతలు

బాన్సువాడ రూరల్, మార్చి 28 : యాసంగి పంటలు చేతికి రావడంతో మండలంలోని వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, జక్కల్‌దాని తండా, తాడ్కోల్, పోచారం తండా తదితర గ్రామాల్లో వరి కోతలు జోరందుకున్నాయి. మిషన్ల ద్వారా పంటలను కోపించి వడ్లను రైతులు ఆరపెడుతున్నారు. కోతలు ప్రారంభమైనప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటను కోయిస్తున్న రైతులు

నగదు స్వాధీనం

నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

నస్రుల్లాబాద్, మార్చి 28 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు విరుద్ధంగా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తున్నందున స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. బిచ్కుందకు చెందిన లంకాల రవి వద్ద రూ.50వేల 300, సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సూరారం రాజు వద్ద రూ.74,100 గురువారం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా ధర్మరాజ్‌పల్లికి చెందిన మొగిలి రాజేశ్ వద్ద రూ. 80,500, నాందేడ్ జిల్లా ఉమ్రికి చెందిన సబుక్‌వార్ సచిన్ వద్ద రూ.84,100, రెంజల్ మండలం నీలం గ్రామానికి చెందిన మోచీరాం చందర్ వద్ద రూ.84,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

కామారెడ్డి/బీబీపేట్/దోమకొండ, మార్చి 28 : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం బయో సైన్స్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 62 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 11,962 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11,938 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్‌లో 10 విద్యార్థులకు 9 మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారని తెలిపారు. బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలోని సెంటర్ (ఏ)లో 180 మంది, సెంటర్ (బీ)లో 170 మంది విద్యార్థులు, మాందాపూర్ సెంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. దోమకొండలోని బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 162 మంది, బాలికల ఉన్నత పాఠశాలలోని సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. గురువారం పరీక్షలకు విద్యార్థులు వందశాతం హాజరయ్యారన్నారు.

కొనసాగుతున్న మెట్లబావి పునర్నిర్మాణ పనులు

రాజంపేటలోని మెట్లబావిలో పూడికను తొలగిస్తున్న పొక్లెయినర్

రాజంపేట్, మార్చి 28 : మండల కేంద్రంలోని అతి పురాతనమైన మెట్లబావి పునర్నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. చారిత్రాత్మకమైన కట్టడాలను పరిరక్షించాలన్న ఉద్దేశంతో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ గతవారం గ్రామస్తులు, యువకులుతో కలిసి శ్రమదానం చేసి.. బావిలోని పూడికతీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం ప్రొక్లెయిన్ సహాయంతో పూడికను తీశారు. ఈ పనులను గ్రామస్తులు, యువకులు దగ్గరుండి చేయిస్తున్నారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు

రక్తదానం చేస్తున్న యువకుడు

కామారెడ్డి, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర)లో ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో గురువారం రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో ఒకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. రక్తదానం చేసిన దాతలను, నిర్వాహకులను అభినందించారు. 27 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవా దళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేద ప్రకాశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు తిరుపతిగౌడ్

దోమకొండ, మార్చి 28 : మండలంలోని ముత్యంపేట్ సొసైటీలో సంఘం సభ్యుడిగా ఉన్న పున్న సాయిలు గత సంవత్సరం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడు సాయిలుకు సొసైటీలో జేపీ ఇన్సూరెన్స్ ఉన్నందున రూ. లక్ష చెక్కును భార్య పున్న శ్యామలకు గురువారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడు సిద్ధరాములు, సంఘం సభ్యులు లక్ష్మి, నారాయణగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, సిద్ధాగౌడ్, మహేందర్‌గౌడ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

కామారెడ్డి రూరల్, మార్చి 28 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బొల్లిగద్ద సుగుణ–నర్సింహులు మూడో కుమార్తె మానస(రోజా)కు కామారెడ్డి మండల వైస్ ఎంపీపీ నరేశ్ గురువారం పుస్తె, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో చిన్నమల్లారెడ్డి ఎంపీటీసీ రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వీప్ ఆక్టివిటీపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

స్వీప్ కార్యక్రమాలపై అవగాహన

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలపై ఓటర్లకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, ప్రస్తుత వివరాలను సరిచేయడం, తప్పుల సవరణ, మృతి చెందిన ఓటర్ల పేర్లు తొలగింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించిన వివరాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అల్లం మహేందర్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి

ఈజీఎస్ సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఆర్డీవో వామన్‌రావు

రామారెడ్డి, మార్చి 28: మండలంలోని కన్నాపూర్ అటవీ ప్రాంతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావు గురువారం పరిశీలించారు. ప్రతి కూలీకి పూర్తి పని కల్పించాలని సూచించారు. ఉపాధి పనికి ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలని ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీవీవో దత్తాద్రి, ఎంపీడీవో సవితారెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

నిజాంసాగర్, మార్చి 28: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి శివారులో సాగు చేస్తున్న వరి పంటలను ఏఈవో స్వర్ణలత గురువారం పరిశీలించారు. ప్రస్తుతం వరిలో మెడవిరుపు, కాండం కుళ్లు, పాము పొడ తెగుళ్ల ఉధృతి కనిపిస్తున్నదని తెలిపారు. వీటి నివారణకు ట్రైప్లాక్సిస్ట్రాబిన్, బెబుకోనజోల్ మందును ఎకరాకు 100 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం మంగ్లూర్ శివారులో సాగునీరు అందక కొంతమేర జొన్న, వరి పంటలు ఎండిపోతుండడంతో వాటిని పరిశీలించారు.

గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ

పిట్లం, మార్చి 28: మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీవో బ్రహ్మం గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వందశాతం పన్ను వసూలు చేయాలని, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శివాజీ ఉన్నారు.

స్థానికుడే కాజేశాడు..

- ఒక్కరోజులోనే చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- రూ. 13.31 లక్షల సొత్తు స్వాధీనం

మద్నూర్/బాన్సువాడ టౌన్, మార్చి 28: మండల కేంద్రంలో మూడురోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఒక్కరోజులోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బాన్సువాడలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. మద్నూర్‌కు చెందిన మాహాజన్ బాలాజీ ఈ నెల 26న సాయంత్రం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. ఇది గమనించిన స్థానికుడు ఉప్పరివార్ శ్రీను తాళం ధ్వంసంచేసి చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 15 తులాల బంగారు ఆభరణలు, పది తులాల బంగారం, రూ. 16 వేల నగదు పోయినట్లు పేర్కొన్నాడు. 27న పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఒక సంచితో శ్రీను అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. అతనివద్ద నుంచి రూ. 13.31 లక్షల సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు తాగుడుకు బానిసై చిన్నచిన్న చోరీలకు అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన సీఐ నరేశ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది సాయిబాబా గౌడ్, సాయిలు, హోంగార్డు యాసీన్ బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రేణుక

డోంగ్లీ, మార్చి 28: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటుచేసిన సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రేణుక గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ ప్రసాద్, ఏఈవో గజానంద్ పాటిల్, నాందేవ్, విండో కార్యదర్శి గంగాధర్, సిబ్బంది వీరేశ్, ఈర్వంత్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని వెల్గనూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వాహనాన్ని ఏఎస్సై లింబాద్రి, సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

– నిజాంసాగర్, మార్చి 28

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

గాంధారి, మార్చి 28: మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి ప్రార్థన, ఆఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, గోపూజ, పుణ్యాహవాచనం, వాస్తు క్షేత్రపాలన తదితర విశేష పూజలు కొనసాగాయి. ఆలయప్రాంగణంలో యజ్ఞహోమాలు నిర్వహించారు. వేడుకలకు యాదవ కులస్తులతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

హోమంలో పాల్గొన్న భక్తులు

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

బిచ్కుంద, మార్చి 28: ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ సూచించారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రోమైండ్ స్కిల్స్ క్యాటలిస్ట్, కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాబ్‌మేళా రూపంలో మన ముందుకే ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగాలు సాధించాలంటే అర్హతతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోమైండ్స్ కంపెనీ ప్రతినిధులు గంగాధర్, హరిప్రసాద్, అధ్యాపక బృందంతోపాటు నిరుద్యోగ యువత, డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ

పోలీసులపై దాడి చేసినవారికి రిమాండ్

పెద్ద కొడప్‌గల్, మార్చి 28: విధుల్లో ఉన్న పోలీసులపై దాడిచేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన సాయంత్రం మండలంలోని బేగంపూర్ చౌరస్తా ఎన్‌హెచ్–161పై ఎస్సై కోనారెడ్డి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కాస్లాబాద్ గ్రామానికి చెందిన కొందరు మద్యం తాగి పోలీసులతో గొడవకు దిగారు. మీకు వాహనాల తనిఖీ చేసే అధికారం ఎవరిచ్చారంటూ ఎస్సైతోపాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దాడిచేసిన వారిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ఎల్లారెడ్డి, మార్చి 28: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జీవశాస్త్రం పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని మూడు సెంటర్లను ఏర్పాటు చేయగా, మొత్తం 703 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఒకటిన ఇసుక వేలం

డోంగ్లీ, మార్చి 28: సీజ్ చేసిన ఇసుకను ఏప్రిల్ ఒకటో తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న ఒక బొలెరో, రెండ్లు ట్రాక్టర్లతో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 28: పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ చేశారు. పిల్లలతో ప్రతిరోజూ వ్యాయామం చేయించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ వెంకటేశం, సీజీవీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

సదాశివనగర్, మార్చి 28 : చంగిచర్లలో దాడిచేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు మండల కేంద్రంలో గురువారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హోలీ సందర్భంగా చంగిచర్లలో దాడికిపాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సంజీవ రెడ్డి, రామకృష్ణ, నవీన్, రమేశ్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.